క్లుప్తంగా

నేడు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా నిలిపివేత

కందుకూరు: నూతనంగా నిర్మించిన 132 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌కు లైన్లు వేయడానికి ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధి అన్ని సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వ్యవసాయానికి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

నివాసాలకు..

తుక్కుగూడ: కందుకూరు 132 కేవీ సబ్‌సేష్టన్‌కు విద్యుత్ లైన్ వేస్తున్న కారణంగా ఆదివారం తుక్కుగూడ పురపాలిక పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని మహేశ్వరం ఏఈ చక్రపాణి తెలిపారు. ప్లాస్టిక్ పార్క్, మంఖాల్ పారిశ్రామిక వాడ, ఫ్యాబ్‌సిటీ, రాంకీ, కావూరిహిల్స్, విశాల్, ప్రజయ్, ఇమామ్‌గూడ, మంఖాల్, శ్రీనగర్, రాచూలూరుగేట్, పెద్దమ్మ ఆలయ పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

21న భూభారతి చట్టంపై అవగాహన

కందుకూరు: భూభారతి చట్టంపై కలెక్టర్ ఆధ్వర్యంలో ఈ నెల 21న కందుకూరు, మహేశ్వరం మండలాల్లో అవగాహన సదస్సులు నిర్వహించనున్నామని తహసీల్దార్ గోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు మహేశ్వరంలోని కాకి ఈశ్వర్ ఫంక్షన్‌హాల్‌లో, అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు కందుకూరు నవారు బాల్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో చేపట్టనున్నామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీ, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. రైతులు, రైతు సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని తహసీల్దార్ కోరారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న మాజీ కౌన్సిలర్ రవినాయక్

తుక్కుగూడ: సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరంలాటిందని తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ బాదావత్ రవినాయక్ అన్నారు. పుర పరిధిలోని హర్షగూడ గ్రామానికి చెందిన జయమ్మ అనారోగ్యంతో బాధపడుతూ.. వైద్యం చేయించుకుంది. వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా.. రూ.36 వేల చెక్కు మంజూరయింది. ఈ మేరకు శనివారం బాధిత కుటుంబానికి ఆయన చెక్కు అందజేశారు. చెక్కు మంజూరు చేయించిన ఎమ్మెల్యే సబితారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

నేలకూలిన బొప్పాయి తోట

కందుకూరు: మండల పరిధిలో శనివారం రాత్రి కురిసిన ఈదురుగాలులు, వడగళ్లతో కూడిన వర్షంతో పంటలు దెబ్బతిన్నాయి. లేమూరులో బొప్పాయి తోటలు నేలకూలి అపారనష్టం వాటిల్లింది. మామిడి కాయలు రాలిపోయాయి.

పశువులకు గాలికుంటు టీకాలు

మొయినాబాద్: పాడి పశువులకు రోగాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల పశువైద్యాధికారి అహ్మద్ అన్నారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అజీజ్‌నగర్‌లో శనివారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు కార్యక్రమం చేపట్టారు. గ్రామంలోని 246 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా ముందు జాగ్రత్త చర్యగా నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రసన్నకుమార్, భీంరావ్, గోరేమియా, గోపాల మిత్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

కొందుర్గు: బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సింలు గౌడ్ డిమాండ్ చేశారు. ఈ నెల 17న విద్యుత్ ప్రమాదంతో మృతిచెందిన అశోక్ రెడ్డి కుటుంబ సభ్యులను సంఘ్ సభ్యులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా నర్సింలు గౌడ్ మాట్లాడుతూ.. గాలి వానతో మూడు రోజుల క్రితం కరెంట్ స్తంభం విరిగిపోయి తీగలు తెగిపడినా లైన్‌మెన్, ఏఈలైన్ మరమ్మతులు చేయకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. అశోక్‌రెడ్డి కుటుంబానికి న్యాయం చేసే వరకు సంఘం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు విద్యాసాగర్, సత్యనారాయణరెడ్డి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు.. యమపాశాలు

రావిర్యాల బస్తీలో ఇళ్లపై నుంచి 11కేవీ లైన్

- ఆందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

తుక్కుగూడ: ప్రజల పాలిట విద్యుత్ తీగలు యమపాశాలుగా మారాయి. సంవత్సరాలు గడుస్తున్నా సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో ప్రాంత ప్రజలు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. విధిలేక విద్యుత్ తీగల కిందే భయభయంగా నివసిస్తున్నామని పేర్కొంటున్నారు. ఇదీ రావిర్యాల 3వ వార్డు పోచమగడ్డ బస్తీ వాసుల పరిస్థితి.

ప్రమాదాలకు నిలయం

ఇంటిపై నుంచి చేతికి అందే ఎత్తులో 11కేవీ విద్యుత్ తీగలు ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని బస్తీ వాసులు భయాందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈదురు గాలులు వీచినప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నామని వాపోతున్నారు. నివాసాలపై లైన్ తీసివేయాలని సంవత్సరాలుగా విద్యుత్ అధికారులు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, కరెంట్ లైన్‌ను మార్చాలని కోరుతున్నారు. ఇదే విషయమై ఏఈ చక్రపాణిని వివరణ కోరగా.. విద్యుత్ లైన్ మార్పు డానికి ప్రణాళిక సిద్ధం చేశామని చెప్పారు. వారం రోజుల్లో తొలగిస్తామని పేర్కొన్నారు.



రావిర్యాలలో నివాసాలపై ఉన్న విద్యుత్ తీగలు

ఎమ్మెల్సీపై చర్యలు తీసుకోవాలి



దయాకర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

కందుకూరు: హిందూ దేవాలయాలు, ప్రధాని మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా నాయకులు కృష్ణగౌడ్, రాజేందర్‌రెడ్డి, మల్లారెడ్డి డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో దయాకర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, పబ్బం గడుపుకోవాలని చూస్తే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్లో హిందువులపై దాడులు జరుగుతుంటే.. కాంగ్రెస్ నాయకులు నోరు మెదపకపోగా.. వారిని రెచ్చగొట్టేలా మాట్లాడటం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ జిల్లా మోర్చా ఉపాధ్యక్షుడు సత్తయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మల్లేశ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఎస్.భూమిరెడ్డి, కిసాన్‌మోర్చా మండల అధ్యక్షుడు కె.చెన్నారెడ్డి, ఎం.వెంకట్‌రెడ్డి, రఘునందన్, వరుణ్, నరసింహ, నవీన్, ప్రవీణ్, ఆంజనేయులు, దయాకర్, బాల్‌రాజ్, కృష్ణగౌడ్, చెన్నయ్య, నరేందర్, మల్లేశ్, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, శ్రీశైలం, భాను, మహేశ్, సురేష్, శేఖర్, యాదగిరి, సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మొయినాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని మొయినాబాద్, సురంగల్, అమ్డాపూర్ రోడ్డు ప్రాంతాల్లో ఆదివారం కరెంటు సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ హము నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా మొయినాబాద్ సబ్‌స్టేషన్ పరిధిలోని విజయ్‌నవ్య ఫీడర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, సురంగల్ ఫీడర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ అంతరాయానికి ఆయా ప్రాంతాల వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

షాద్‌నగర్: ఇటీవల వడగళ్లు, ఈదుర గాలులతో కూడిన భారీ వర్షానికి మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో పెద్ద ఎత్తున వరి, మామిడి, కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. శనివారం మండల వ్యవసాయ అధికారి నిషాంత్‌కుమార్ ఆధ్వర్యంలో అధికారులు గ్రామంలో పర్యటించి వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి వివరాలు సేకరించారు. బూర్గులలో 14 మంది రైతులకు చెందిన 16.20 ఎకరాల విస్తీర్ణంలో వరి పంటలు దెబ్బతిన్నట్లు ఏఓ తెలిపారు. బాధితుల వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తున్నట్లు వివరించారు.

పుస్తకాల అందజేత

కేశంపేట: విద్యార్థులు స్వామి వివేకనందుడి చరిత్రను ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెదురువెళ్లి భాస్కర్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నిర్దవెళ్లి గ్రామంలో శనివారం ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో స్వామి వివేకానంద జీవిత చరిత్ర పుస్తకాలను భాస్కర్‌గౌడ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... యువత, విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. స్వామి వివేకానంద జీవిత చరిత్రను చదివి ఆచరించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయ్, ఉపాధ్యాయులు కరుణాకర్‌గౌడ్, కృష్ణారెడ్డి, లత, భూదేవి, గంగమ్మ, సుమలత, విజయ్‌కుమార్, నవనీత, రజిత, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న కేంద్రం

పహాడీషరీఫ్: రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కేంద్ర ప్రభుత్వం అపహాస్యం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జల్‌పల్లి మున్సిపాలిటీ కో– ఆర్డినేటర్లు షేక్ జహంగిరుద్దీన్, తయ్యబ్ దయానీ ఆరోపించారు. శనివారం జల్‌పల్లి మున్సిపాలిటీ కొత్తపేటలో జై బాపు జైభీమ్ జైసంవిధాన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా బస్తీల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పాలిట పెన్నిధిగా మారిందన్నారు. సన్న బియ్యం పథకం ద్వారా ప్రతి పేదింటి బిడ్డ మూడు పూటలా నాణ్యమైన భోజనం చేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధితో పాటు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వివరించాల్సిన అవసరం కార్యకర్తలపై ఉందని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అహ్మద్ బామ్, ఎం.ఎ.బారీ, నవీన్ గౌడ్, నవాజ్, మల్లికార్జున, బాబు తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ప్రమాదం జరిగితే.. సమాచారం ఇవ్వండి

మహేశ్వరం: అగ్ని ప్రమాదాలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలని అగ్నిమాపక శాఖ అధికారులు కోరారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు అగ్నిమాపక అధికారులు, సిబ్బంది, టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ యాక్టింగ్ లీడింగ్ ఫైర్‌మెన్ పి.సాయికుమార్, సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ సంగి రమేష్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- కొత్తూరు మున్సిపల్ బడ్జెట్ సమావేశం

కొత్తూరు: ఆదర్శ మున్సిపాలిటీగా కొత్తూరును అభివృద్ధి చేయడానికి బృహత్తర ప్రణాళిక తయారు చేసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాలకవర్గ సభ్యులకు సూచించారు. మున్సిపాలిటీ సమావేశ మందిరంలో శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య ఆధ్వర్యంలో నిర్వహించిన బడ్జెట్, సాధారణ సమావేశంలోఆయన, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డిలు హాజరయ్యారు. బడ్జెట్ సమావేశంలో భాగంగా సభ్యులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.9.43 కోట్లు, ప్రభుత్వ నిధులు రూ.31.98 కోట్లు మొత్తం 40.41 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం తెలిపారు. ఈ నిధులతో ఆయా వార్డుల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయనున్నట్లు పాలకవర్గం ప్రకటించారు. కొత్తూరు మున్సిపాలిటీను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. గతంలో మున్సిపాలిటీలకు విడుదల కానీ నిధులు ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధికి సహకరించాలి

మున్సిపాలిటీలో చేపట్టే పనులకు అధికారులు తప్పకుండా సహకరించాలని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి సూచించారు. మున్సిపాలిటీలో అధికారులు, కౌన్సిలర్లు తమ దృష్టికి తెస్తున్న సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. గత బడ్జెట్ సమావేశంలో జరిగిన తీర్మానాలు, చేసిన పనులకు సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కమిషనర్ బాలాజీ, పాలకవర్గం సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సీఐకి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న బీజేవైఎం నాయకులు

ప్రధానిపై కాంగ్రెస్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు రాఘవేందర్ ముదిరాజ్

మీర్‌పేట: ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, కిషన్‌రెడ్డిలపై కాంగ్రెస్ నాయకులు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని, వారికి తగిన బుద్ధి చెబుతామని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు చింతల రాఘవేందర్ ముదిరాజ్ హెచ్చరించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన దయాకర్, అంజన్‌కుమార్ యాదవ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం నాయకులు ఇన్‌స్పెక్టర్ నాగరాజుకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తప్పు చేయకపోతే సోనియా, రాహుల్‌గాంధీలు ఈడీ కేసులకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం పోయిందని, రానున్న రోజుల్లో దేశంలో ఆ పార్టీ కనుమరుగవడం ఖాయమన్నారు.

పెరుగుతున్న దాడులు

వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా మీర్‌పేట కూడలిలో బీజేవైఎం నాయకులు ప్లకార్డులు ప్రదర్శించి, ధర్నా చేశారు. ఆ రాష్ట్రంలో హిందువుల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని, మైనార్టీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో హిందువులపై దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులను అరికట్టి, నిందితులను శిక్షించాలని కోరారు. బీజేవైఎం మీర్‌పేట అధ్యక్షుడు ప్రదీప్, నాయకులు ముఖేష్ ముదిరాజ్, కరుణానిధి, హైందవిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విక్కీ సాగర్, వెంకటేశ్వర్‌రెడ్డి, పవన్‌కృష్ణ ఉన్నారు.

రజతోత్సవ సభను జయప్రదం చేయండి



సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మహేశ్వరం: బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల్లో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా 25 ఏళ్ల క్రితం ఆవిర్భవించిన తెలంగాణ రాష్ట్ర సమితి(టీఆర్ఎస్.. నేడు బీఆర్ఎస్) పార్టీ పాతికేళ్ల సంబురాలను వరంగల్‌లో ఈ నెల 27న భారీ ఎత్తున నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారని చెప్పారు. సభకు కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే సబితారెడ్డి నాయకత్వంలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వర్కల యాదగిరి గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వరరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు హన్మగళ్ల చంద్రయ్య, కర్రోళ్ల చంద్రయ్య, బండారి లింగం ముదిరాజ్, తొంట రవీందర్, రమేష్, రాయప్ప, యూత్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, దేవులా నాయక్, పాండు, మోతిలాల్ నాయక్, లింగ్యా నాయక్, విర్యా నాయక్, ప్రవీణ్, నర్సింగ్, జంగయ్య, రవి, మచ్చేందర్, కృష్ణ, సురేష్ పలువురు పాల్గొన్నారు.

ఆలయంలో ఘనంగా పల్లకీ సేవ

షాద్‌నగర్: పట్టణ శివారులోని చొడమ్మగుట్ట హనుమాన్ దేవాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచార్యులు, కృష్ణ, ప్రమోద్‌లు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారి పల్లకీ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భజనలు చేశారు. అనంతరం అచ్చంపేట ఎంపీడీఓ పాలకొండ మధుసూధన్‌గౌడ్, హైమావతి దంపతులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీశైలంగౌడ్, భక్తులు నితీష్‌గౌడ్, కీర్తిగౌడ్, శ్రీకాంత్, వెంకటేష్‌గౌడ్, జనార్దన్, సుదర్శన్, సురేందర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, రఘుగౌడ్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

నిర్లక్ష్యం వీడరు.. నిర్మాణం పూర్తి చేయరు

ప్రజల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంకుల నిర్మాణానికి ఆదిలోనే హంసపాదు పడింది. నిధుల లేమి, అధికారుల సమన్వయలోపం వెరసి స్థానికులకు నీటి సౌకర్యాన్ని మరింత దూరం చేస్తున్నాయి. కొత్తూరు మండల పరిధిలోని చాలా గ్రామాల్లో ఈ సమస్య వేధిస్తోంది.

- నిరుపయోగంగా తాగునీటి ట్యాంకులు
- నిధుల లేమితో నిలిచిన పనులు

కొత్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో కొన్నేళ్ల క్రితం రూ.లక్షలు వెచ్చించి ప్రారంభించిన తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. పలుచోట్ల నిధుల లేమి, మరికొన్ని చోట్ల అధికారుల మధ్యన సమన్వయలోపం.. కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యంతో ప్రారంభానికి ముందే ట్యాంకులు శిథిలమవుతున్నాయి. అంతేకాకుండా కొన్ని ఊర్లల్లో నాణ్యత లోపించడంతో లీకేజీ అవుతున్నాయి. అయినప్పటికీ సంబంధిత శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ప్రజలు తాగేందుకు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కోవాల్సిన దుస్థితి దాపురించింది.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు!

మండలంలోని మక్తగూడ పంచాయతీ పెద్దగుట్ట తండాలో కొన్నేళ్ల క్రితం సుమారు రూ.6 లక్షలు వెచ్చించి తాగునీటి ట్యాంకు పనులను ప్రారంభించారు. తీరా నిధుల లేమి కారణంగా మధ్యలోనే నిలిచిపోయాయి. ఏళ్లు గడుస్తున్నా పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో ట్యాంకు తండాలో దిష్టిబొమ్మలా మారిందని స్థానికులు వాపోతున్నారు. జేపీదర్గా ఆవరణలో గతంలో అప్పటి జిల్లా ఎంపీ నిధుల కింత సుమారు రూ.5 లక్షలతో భక్తుల సౌకర్యార్థం ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. పనులు పూర్తయిన తర్వాత ట్రయల్‌రన్ చేయగా ట్యాంకు నుంచి నీరు చాలా చోట్ల లీకేజీ రూపంలో బయటకు వచ్చింది. అవాక్కైన అధికారులు కాంట్రాక్టర్‌తో చర్చించి మరమ్మతులు చేయిస్తామని ప్రకటించారు. కానీ నేటికి పనులు చేయించకపోవడంతో ట్యాంకు నిరుపయోగంగా మారింది.



పెద్దగుట్టతండాలో అసంపూర్తిగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు



జేపీదర్గా ఆవరణలో వాడుకలో లేని ట్యాంకు

చొరవ చూపని అధికారులు

ట్యాంకులు వృథాగా మారినా.. మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా... పనులు మధ్యలో నిలిచిన వాటిని పూర్తి చేసేందుకు సంబంధిత శాఖలకు చెందిన అధికారులు చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. దీంతో వాటి నిర్మాణం కోసం ప్రభుత్వం వెచ్చిస్తున్న రూ.లక్షల నిధులు బూడిదలో పోసిన పన్నీరులా మారుతున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో నిర్మాణంలో ఉన్న ట్యాంకులను గుర్తించి, వాటికి నిధులు కేటాయించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.